క్లుప్తంగా

ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రులు నిర్వహణకు సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించారు. రిపోర్టును సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు సమాచారం. జిల్లా స్థాయిలో పరిశీలన అనంతరం తనిఖీ చేసిన రెండింటిలో ఓ ఆస్పత్రికి నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం.

20 నుంచి ఎంపిక పోటీలు

మణుగూరురూరల్: పట్టణంలోని జెడ్పీ కోఎడ్యుకేషన్ పాఠశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వీరస్వామి, పాఠశాల హెచ్ఎం నాగశ్రీలు తెలిపారు. మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. మండల స్థాయి క్రీడల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరీక్షలు చేయించుకోవాలి

అన్నపురెడ్డిపల్లి: ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లీనిక్‌లలో మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ తన్మయి సూచించారు. మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళ క్లినిక్‌లో భాగంగా మహిళలకు ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. దీంతోపాటు మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. సీహెచ్ఓ పూలమ్మ, డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పేర్లు తొలగించండి

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో దాదాపు 458 మంది ఓటర్ల పేరు రెండు సార్లు నమోదు చేశారని, వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తొలగించాలని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి చేశారు. పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణ ప్రసాద్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన కృష్ణప్రసాద్ తక్షణమే అలాంటి పేర్లను తొలగిస్తామని తెలిపారు. సర్పంచ్ అట్టం రమ్య, పార్టీ నాయకులు జూపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ నండ్రు రమేష్, ఆళ్ల సత్తిబాబు, అల్లాడి రామారావు, పల్లేల రామలక్ష్మయ్య, నాగ కిషోర్ పాల్గొన్నారు.

తిమ్మంపేటలో హరితహారం

ములకలపల్లి: మండలపరిధిలోని తిమ్మంపేట ప్రాథమిక పాఠశాలలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్ద జలగం లీలా సంతోష్ మామాడి, సపోట జాతులకు చెందిన 100 మొక్కలను రూ.4 వేలతో కొనుగోలు చేసి, వితరణగా అందజేశారు. మంగళవారం పాఠశాలలో ఆవరణలో హెచ్ఎం శంకర్. ఉపాధ్యాయబృందం, విద్యార్థులు వీటిని నాటారు.

'తుమ్మల'తోనే ప్రయాణం

గుండాల: తుమ్మల నాగేశ్వరావు ఏ పార్టీలో ఉన్నా తాను ఆయనతోనే ప్రయాణం సాగిస్తానని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ.అతహర్ అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి తాను రాజీనామా చేస్తున్నానని త్వరలో తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతానని తెలిపారు. త్వరలోనే ఉమ్మడి గుండాల మండలం నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు ఉంటాయని అన్నారు.

రాజ్యాధికారానికి పోరాడాలి

భద్రాచలంటౌన్: దళితులు వర్గీకరణను వదిలేసి రాజ్యాధికారం కోసం పోరాటాలు నిర్వహించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం కాలం చెల్లిన వర్గీకరణను మందా కృష్ణ మాదిగ మళ్లీ తెరపైకి తెస్తున్నాడని విమర్శించారు. గత కాంగ్రెస్ హయాంలోనే సుప్రీం కోర్టు వర్గీకరణ చెల్లదని కొట్టేసిన విషయాన్ని గుర్తు చేశారు.

బోనస్ విడుదల చేయాలి

దుమ్ముగూడెం: 2016 నుంచి 2021 వరకు తునికాకు సేకరించిన బట్టిగూడెం గ్రామానికి చెందినటువంటి 60 మంది కార్మికులకు తునికాకు బోనస్ అమౌంట్ జమ కాలేదని, తక్షణమే నగదును జమ చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు మర్మం చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఫారెస్ట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రైటర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కోర్స చిలకమ్మ, మడకం లక్ష్మి, పిసోడి ప్రభాకర్, సరియం ముత్యాలక్క, కోర్స లక్ష్మయ్య, కల్లూరి యరయ్య, కుంజా లక్ష్మి, మడకం మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా కొలువుదీరిన గణేషుడు


అశ్వారావుపేటరూరల్: మట్టితో చేసిన గణపతి, పాము పుట్ట

వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఊరూరా గణనాథులు కొలువుదీరి తొలి పూజలందుకున్నారు. వీధి వీధినా ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి మంగళవాయిద్యాల నడుమ బొజ్జ గణపయ్యలను ప్రతిష్ఠించి శోభాయమానంగా అలంకరించారు. కొలువుదీరిన వినాయకులకు అర్చకులు మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మరోవైపు ఇళ్లలోనూ ప్రజలు వినాయకుడి మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి గరిక, పండ్లు, వెలగ కాయ, పూలతో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గణపతి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గుండాల: సుభాష్ నగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


మణుగూరురూరల్: బొజ్జ గణపయ్యను దర్శించుకుంటున్న విప్ రేగా కాంతారావు


భద్రాచలం: పూజలు చేస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ దంపతులు


చర్ల: సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్‌క్యాంపులో కమాండెంట్ ప్రద్యుమ్న్ కుమార్ దంపతుల పూజలు


భద్రాచలంటౌన్: ఇందిరా మార్కెట్‌లో గణపతికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య


అశ్వారావుపేటరూరల్: గణపతికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


మణుగూరురూరల్: మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పూజలు


అన్నపురెడ్డిపల్లి: శివాలయంలో గణపతిని దర్శించుకుంటున్న భక్తులు


చంద్రుగొండలో..


అన్నపురెడ్డిపల్లి: వినాయక మండపం వద్ద యువత


అశ్వాపురం: మండపంలో పూజలు చేస్తున్న ఎస్సై సురేష్


దుమ్ముగూడెం: లక్ష్మీనగరంలోని మండపం వద్ద యువత కోలాహలం


బూర్గంపాడు: సారపాకలో వర్తకసంఘం ఆధ్వర్యంలో..


కరకగూడెం: కొలువుదీరిన గణనాథుడి వద్ద భక్తులు


దమ్మపేటలో..


భద్రాచలంటౌన్: సీఐ నాగరాజు రెడ్డి ఆధ్వర్యంలో..


గుండాల రామాలయం వద్ద కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు

ఓటింగ్ విధానంపై అవగాహన

మణుగూరుటౌన్: పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో మణుగూరు రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఓటింగ్ యంత్రాలపై, ఓటు నమోదు, ఓటు వేసే విధానంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దార్ రాఘవరెడ్డి మాట్లాడుతూ.. ఈవీఎంలు, వీవీప్యాట్లపై ఓటు హక్కు వినియోగించుకునే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. వీవీప్యాట్లు, ఈవీఎంల ద్వారా ఓటు హక్కును క్షణాల్లో వేయవచ్చన్నారు. ఓటర్‌గా నమోదు చేసుకున్న ప్రతీ ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఓటు నమోదు, సవరణ, మార్పులు చేసుకోలేని వారు వెంటనే ఓటర్ హెల్ప్ లైన్ ద్వారా కానీ, రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ముత్యాలరావు సూచించారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరావు అధ్యక్షతన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఓటర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాబురావు,మల్లెల శ్రీనివాస్, కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన దిశ సభ్యులు

భద్రాచలంఅర్బన్: వినాయక చవితి పండుగ సందర్భంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి భద్రాచలం ఏఎస్పీని పరితోజ్ పంకజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మట్టి ప్రతిమ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలతి శారద, మంగ, వరలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఫిట్ కమిటీ ఎన్నిక

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని సింగరేణి ఆస్పత్రి ఏఐటీయూసీ నూతన ఫిట్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ తెలిపారు. ఫిట్ కమిటీ అడ్వైజర్‌గా జి.రామారావు, కార్యదర్శిగా కె.పద్మావతి, సహాయ కార్యదర్శిగా గడ్డం రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మధు, ఈఎస్ విద్యాశాలి, సుధారాణి, బి.రామారావు, జనరల్ షిఫ్ట్ ఇన్‌చార్జ్‌గా ఉషారాణితోపాటు నాగజ్యోతి, ఏ.రాజేష్, బి.పవన్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాన్ని ఆస్పత్రి డీవైసీఎంఓ డాక్టర్ మేరికుమార్‌కి రాంగోపాల్ పరిచయం చేసి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాసరావు, దాట్ల సందీప్‌కుమార్, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా గ్రంథాలయం


టైల్స్ వేయడంతో సుందరంగా, కొత్తగా కనిపిస్తున్న గ్రంథాలయం

చర్ల: చర్లలోని శాఖా గ్రంథాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. గతంలో తుప్పు పట్టిన ర్యాక్‌లు, విరిగిన కుర్చీలు టేబుళ్లు, పగిలిపోయిన ఫ్లోరింగ్, చిరిగిన పుస్తకాలతో కళా విహీనంగా ఉన్న చర్ల శాఖ గ్రంథాలయం ప్రస్తుతం రంగులు, హంగులతో దర్శమిస్తోంది. ఈ ఏడాది మార్చి 20న చర్లకు వచ్చిన అప్పటి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి.. ఈ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆ సందర్భంలో గ్రంథాలయంలో చిరిగిన పుస్తకాలు, విరిగిన కుర్చీలు టేబుళ్లు, పగిలి ఉన్న ఫ్లోరింగ్, చెదలు పట్టి ఉన్న కిటికీలు, తలుపులను చూసిన కలెక్టర్ అనుదీప్ చలించారు. అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి.. దీని మరమత్తులకు వెంటనే అంచనా తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. అటు తరువాత దీని మరమ్మతుల కోసం తన గ్రాంట్ నుంచి రూ.6 లక్షలను మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో శాఖ గ్రంథాలయంలో కొత్త తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయడంతో పాటు పగిలిన ఫ్లోరింగ్ స్థానంలో టైల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పాటు తుప్పు పట్టిన ఐరన్ ర్యాక్‌లను మార్చి వాటి స్థానంలో కొత్త ర్యాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు పాఠకులు కూర్చునేందుకు అనువుగా కుర్చీలు, టేబుళ్లను ఏర్పాటు చేశారు. విద్యుద్దీకరణ సైతం చేసి లైట్లు, ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. గతంలో శాఖ గ్రంథాలయంలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పట్టుమని పది మంది కూడా పాఠకులు రాకపోగా.. ప్రస్తుతం ప్రతీ రోజు 50 నుంచి 60 మంది వరకు పాఠకులు వచ్చి వెళ్తున్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగపడుతోంది. చొరవ చూపిన కలెక్టర్ అనుదీప్‌కు పాఠకులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ప్రభుత్వం చర్చలు జరపాలి

అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం వెంటనే కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అన్నారు. అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు సమ్మె శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. కనీస వేతన చట్టం ప్రకారం రూ.26వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


గుండాల: సమ్మెలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



చర్ల: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, పక్కన సీఐటీయూ నాయకుడు బ్రహ్మచారి


అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీల సమ్మెలో మాట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య

వృద్ధురాలిపై మనవడి దాడి

అశ్వారావుపేటరూరల్: వృద్ధురాలిపై దాడికి పాల్పడిన మనవడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన గెల్లంకి లక్ష్మి అనే వృద్ధురాలిపై మనవడు పింగళి వంశీ మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని దాడి చేశాడు. దాంతో బాధితురాలు చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుతో వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

దుమ్ముగూడెం: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం రాత్రి సీతారాంపురం నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్.. ఎస్సై గణేష్ సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా ఎదురుపడింది. అనుమతి పత్రాలు అడుగగా లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో గ్యాస్ లీక్

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనం వండుతున్న క్రమంలో గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు వెంటనే అప్రమత్తమై గ్యాస్ సిలిండర్‌ను ఆపేసి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు.

తాత్కాలిక ఉద్యోగి సస్పెన్షన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం తాత్కాలిక ఉద్యోగి దుర్గను ఆలయ అధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. ఆదివారం ఒక ఆవును ఆటోకు కట్టి ఆలయ గోశాలకు తరలించగా, దీనిపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

22న క్రీడాపోటీలు

ములకలపల్లి: కమలాపురం ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు మండల పీడీ, పీఈటీలు తెలిపారు. ఎమ్మార్సీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారని, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు


చంద్రుగొండ: పోకలగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు


భద్రాచలంఅర్బన్: పరిశుభ్రతపై ర్యాలీ తీస్తున్న విద్యార్థినులు

భద్రాచలంఅర్బన్: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై భద్రాచలం పట్టణంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఐటీసీ వావ్ సంస్థ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యదర్శి మిక్కినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. స్వచ్ఛతహిసేవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త, పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమా, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఐటీసీ వావ్ సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రమ్య, రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం, సీతాయిగూడెం, చంద్రుగొండ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలు, మానవహారం చేశారు. పారిశుద్ధ్యంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ జి.రేవతి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ

మణుగూరురూరల్: వినాయకచవితి పండుగ సందర్భంగా పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్‌లో లయన్స్ క్లబ్, వాసవిక్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో పలువురు భక్తులకు మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలకు మట్టి వినాయకులనే పూజించాలని, తద్వారా పర్యావరణాన్ని, జల కాలుష్యాలను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ దుస్సా సమ్మయ్య, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, అడబాల నాగేశ్వరరావు, వాసవిక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో సోమవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ భద్రాచలం అధ్యక్షుడు వెంకటరెడ్డి చేతుల మీదగా 550 మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ భద్రాచలం పక్షాన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ కొండిశెట్టి రామ్, బ్రహ్మయ్య, కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి భరత్ కుమార్, బి.వెంకట రమణారెడ్డి, రంగారెడ్డి పంజా సునీల్, గోళ్ల భూపతి రావు, జయరాజు, దాట్ల శ్రీనివాసరాజు, ఉమా శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


భద్రాచలంఅర్బన్: మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

మణుగూరుటౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణమంతా పత్రి, పాలవెల్లి, పండ్ల విక్రయాలతో కళకళలాడగా.. వాసవిక్లబ్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మట్టి గణనాథుల ప్రతిమలను ఉచితంగా అందజేశారు.

ములకలపల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో మండలకేంద్రంలో లంబోదరుని మట్టిప్రతిమలను పంపిణీ చేశారు.